## మరిన్ని పథకాలు సాధించి, జిల్లా కీర్తిని పెంచాలి

**కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్**

**విశాలాంధ్ర-శ్రీకాకుళం** : మరిన్ని పథకాలు సాధించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరలో రజత, కాంస్య పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు సౌమ్య రాణి, మైలపల్లి సత్యం. భారత క్రీడా ప్రాధికార సంస్థ" వారు ప్రతిష్టాత్మకంగా చెన్నై నగరం వేదికగా గత నెల 19వ తేదీ నుండి 31వ తేదీవరకు నిర్వహించిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో శ్రీకాకుళం క్రీడా ప్రాధికార సంస్థ అధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు కడపల సౌమ్యరాణి జూడోలో రజతం, మైలపల్లి సత్యం వాలీబాల్ లో కాంస్య పతకాలు సాధించారు, తదుపరి వీరు పతకాలతో జిల్లా కలెక్టర్ వారిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు, వీరిని కలెక్టర్ అభినందించారు.

## చెరువులు, కాలువల ఆక్రమణలను తొలగించండి

**విశాలాంధ్ర-పలాస** : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ చెరువులు, కాలువలు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని పలాస నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు కోరారు. సోమవారం పలాస తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్‌వివిఎస్ నాయుడుకు ఆక్రమణలను గుర్తించి వాటి వివరాలు తెలపాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చెరువులు కాలువలు ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు ఇచ్చిందని, ఆ ఆదేశాలను పలాస కాశీబుగ్గలో అమలుకావటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారులు ఏపార్టీ అధికారంలోకి వస్తే ఆపార్టీ నాయకులను భజనలు చేస్తూ అక్రమాలకు పాల్పడ్డాతున్నారన్నారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో శ్యాంసుందర్, సత్యం ఉన్నారు.

## జాతీయస్థాయి క్రీడాకారుడు అభిరామ్‌కు అభినందనలు

**విశాలాంధ్ర-కవిటి** : మండలంలోని ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన బడ్డ అభిరామ్ ఇటీవల ఖేలో ఇండియా జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున పాల్గొని జట్టుకి సారథ్యం వహించాడు. ఈ ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణంలో అభిరామ్ జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు బ్రాంచ్ మెడల్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించినందుకు అభినందిస్తూ విద్యార్థుల మధ్య కరస్పాండెంట్ లోల్ల రాజేష్ విద్యార్థుల తల్లిదండ్రులు,పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు అభిరాంకు ఘనంగా సన్మానించారు. అనంతరం కరెస్పాండెంట్ రాజేష్ మాట్లాడుతూ అభిరామ్ మరింత ఉన్నత శిఖరాలకు ఎదిగి మారుమూల ప్రాంతమైన ప్రగడపుట్టుగ గ్రామంతో పాటు ఉద్దాన ప్రాంతానికి మంచిపేరు తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రదర్శన చేపట్టి జిల్లాకు కీర్తిని తీసుకురావాలని కోరారు. అలాగే అభిరామ్ కు శ్రీకాకుళం జిల్లా వాలీబాల్ అసోసియేషన్‌తో పాటు రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ చేసిన కృషికి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందు మాధవి, రాష్ట్ర వాలీబాల్ క్రీడాకారులు ప్రసాద్, ఏవో రమేష్‌తోపాటు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రొక్లైన్ ఆపరేటర్ల నిరవధిక సమ్మెకు సంఘీభావం

**టెక్కలి జనసేన ఇన్‌చార్జ్ కణితి కిరణ్**

**విశాలాంధ్ర-టెక్కలి** : టెక్కలిలో గత ఐదు రోజులుగా శ్రీశ్రీ దుర్గామాత ప్రొక్లైన్ అపరేటర్స్ యూనియన్ చేస్తున్న నిరవధిక సమ్మెకు సోమవారం టెక్కలి జనసేనపార్టీ తమ సంఘీభావాన్ని తెలిపింది. ప్రొక్లైన్ ఆపరేటర్ల యూనియన్ అధ్యక్షుడు మధుబాబు తమ డిమాండ్లను కణితి కిరణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ప్రొక్లైన్ ఆపరేటర్లు గత ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న గ్రానైట్ యాజమాన్యం వారు కనీసం చర్చలకు రాకపోవడం వారి అహంకారాన్ని తెలియజేస్తున్నదని మరియు ఆపరేటర్ల ముఖ్య డిమాండ్లయిన కనీస వేతనం ముప్పై వేలు, ఆపరేటర్లకు ఇన్సూరెన్స్, 8 గంటల పనిదినాన్ని వెంటనే అమలు చేయాలని కణితి కిరణ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొక్లైన్ ఆపరేటర్ల యూనియన్, టెక్కలి జనసేన నాయకులు గవరయ్య, కుమారస్వామి, గద్దాయ్ భాస్కర్, విశ్వనాథం, గణేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటమి భయంతోనే తిలక్‌పై విమర్శలు

**విశాలాంధ్ర-నందిగాం** : నందిగాం మండల ఎంపీటీసీలు సర్పంచులు కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే వైసీపీ శ్రీకాకుళం పార్లమెంట్లో గెలుస్తుందనే భయం పుట్టుకొచ్చి ఇలాంటి అర్థరహిత వ్యాఖ్యలు చేశారని నందిగాం ఎంపీటీసీ అంబోధి విష్ణు, హరిదాసు పురం సర్పంచ్ కనితి నారాయణమూర్తి, కర్లపూడి సర్పంచ్ తమెర రాజు, ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వీడియో సందేశం విడుదల చేశారు. అచ్చెన్నాయుడు పదజాలం చూస్తే దారుణంగా ఉంటుందని తిలక్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పటికీ తిలక్ అసభ్య పదజాలం వాడలేదని ఈ విషయాన్ని గుర్తించాలని అసభ్య పదజాలంతో రెచ్చిపోతే ప్రజలు ఓట్లు వేయరని అచ్చన్నకు బుద్ధి చెప్పడానికి జిల్లా ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. స్థానిక టిడిపి నందిగాం మండల అధ్యక్షుడు ఏదో నోటికి వచ్చింది మాట్లాడుతున్నారని అది సబబు కాదని దిమ్మలాడు సొసైటీలో మీరు చేసిన అవినీతి ఇప్పటికీ ప్రజలు మాట్లాడుకుంటున్నారని, పినకాన అజయ్ కుమార్ చేసే అవినీతి చిట్టా మా దగ్గర ఉందని చర్చకు రావడానికి మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఒక ఎంపీ అభ్యర్థి పై విమర్శలు చేసే ముందు నిజానిజాలు తెలుసుకోవాలని అర్థరహితమైన విమర్శలు చేస్తే ప్రజల నమ్మరని అన్నారు.

## పలాస, వజ్రపుకొత్తూరు తహశీల్దార్‌లుగా నాయుడు, సురేష్ బాధ్యతలు

**విశాలాంధ్ర-పలాస** : పలాస తహశీల్దార్‌గా ఎస్.వి.వి.ఎస్.నాయుడు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో అనకాపల్లి జిల్లా నాతవరం తహశీల్దార్‌గా పని చేశారు. గతంలో పలాస తహశీల్దార్‌గా పని చేసిన మధుసూధనరావు అనకాపల్లి కశింకోటకు బదిలీపై వెళ్లారు.

**వజ్రపుకొత్తూరు** : వజ్రపుకొత్తూరు తహశీల్దార్‌గా మామిడి సురేష్‌ను ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో వజ్రపు కొత్తూరు తహశీల్దార్‌గా పనిచేసిన అప్పలస్వామి విశాఖపట్నం జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో సురేష్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కొత్త తహశీల్దార్ సురేష్‌ను మండల డీలర్లు, విఆర్‌వోలు, విఆర్ఎలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చంతో ఆహ్వానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ గిరి, ఆర్.ఐ పవిత్ర, డీలర్ల సంఘ అధ్యక్షులు తవిటయ్య, కె.కామేశ్వరరావులు పాల్గొన్నారు.

## సమస్యలు పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి

**ఎస్‌టియు జిల్లా శాఖ వినతి**

**విశాలాంధ్ర-ఆమదాలవలస** : ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలను పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని అటువంటి పార్టీలకే మద్దతు ఉంటుందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఎస్వి రమణమూర్తి, పదాల తమ్మి నాయుడులు టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ విప్ కూన రవికుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం పార్టీ క్యాంపు కార్యాలయంలో అందించారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలు సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలుచేయాలని జీవో 117 రద్దు 12వ పిఆర్‌సి అమలు, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని మున్సి పల్ ఉపాధ్యాయులకు సర్వీస్ నిబంధనలు రూపొందించి బదిలీలు పదోన్నతులు చేప ట్టాలని, ప్రతినెల 1 ఒకటవ తేదీన ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు జీతాలు జమ చేయాలి, ప్లస్ టు పాఠశాలలో పిజిటి ఉపా ధ్యాయులకు 2 ఇంక్రిమెంట్లు ఇవ్వాలని 11వ పిఆర్‌సి, డిఎ, ఎపిజిఎల్ఐ, ఎస్ ఎల్ పెండింగ్ బకాయిలు చెల్లించాలని, 1998 ఉపాధ్యాయులకు పదవి విరమణ వయసు 62 సం"రాలకు పెంచాలి కేజీబీవీ ఉపాధ్యా యులకు ఎం టి ఎస్ అమలు చేయాలని, తదితర ఉపాధ్యాయ ఉద్యోగులు ఎదు ర్కొంటున్న అంశాలను పార్టీ ఎన్నికల మేని ఫెస్టోలో చేర్చమని కోరుతూ జిల్లా టిడిపి అధ్యక్షులు కోన రవికుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఎస్ టి యు శ్రీకాకుళం జిల్లాశాఖ పక్షాన వినతి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు ఎస్.వి రమణమూర్తి, పదాల తమ్మినాయుడు మరియు జిల్లా ఉపాధ్యక్షులు జి. శ్రీనివాస్, గార మండల అధ్యక్షులు మొయ్యి తేజ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 16న జరిగే సమ్మెను జయప్రదం చేయండి

**- కార్మిక, రైతు, యువజన, విద్యార్థి సంఘాల పిలుపు**

**విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్:** కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, యువజన, విద్యార్థి సంఘాల వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు డోల శంకర్రావు అన్నారు. స్థానిక రామలక్ష్మణ జంక్షన్ లో గల కామ్రేడ్. ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్ లో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం 20వేల రూపాయలు అమలు చేయాలని, ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించి, 200 రోజులకు పెంచాలని, వేతనం 600 రూపాయలు పెంచి రెండు పూటల పని కల్పించాలని, ఆహార భద్రత చట్టాన్ని పటిష్ట పరచాలని అన్నారు. అలాగే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదలచేసి, కడప ఉక్కును నిర్మించాలని విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని, బంజరు భూములన్నిటికీ పట్టాలు ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, నిర్వాసితులకు పూర్తి పునరావాసం, నష్టపరిహారం అందివ్వాలని, అటవీ హక్కుల చట్టం సవరణలు ఉపసంహరించాలని, ఆదివాసులకు హక్కులను కాపాడాలని, ఇన్ పుట్ సబ్సిడీ, పంటల బీమా వెంటనే అమలు చేసి పై డిమాండ్ల సాధనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఏఐవైఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు అయినింటి లోకనాథం, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

## స్పందనకు జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలి

**- విజ్ఞప్తుల వేగవంత పరిష్కారానికి చర్యలు చేపట్టండి**
**- స్పందన రిజిస్ట్రేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలన**

**శాలాంధ్ర-శ్రీకాకుళం:** స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలి, స్పందన సమస్యల వేగవంత పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహన్ రావు, డిఆర్డిఏ, పి.డి విద్యాసాగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జీలాని సమూన్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారి మాత్రమే తప్పక హాజరు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూవివాదాలు తదితరాలకు సంబంధించి 250 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈసమస్యలన్నీ నిర్దేశిత సమయం లోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు.

**స్పందన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన...** మొదటిసారిగా స్పందన కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ స్పందన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలించారు. పౌర సరఫరాలు, గృహ నిర్మాణ శాఖ, రెవిన్యూ, విభిన్న ప్రతిభవంతులు, ఆరోగ్య తదితర శాఖలు చేపడుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ విధానాన్ని సంబంధిత సిబ్బందితో మాట్లాడి ఆరాతీశారు. ఈ స్పందన కార్యక్రమంలో కెఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ దొరబాబు, అటవీ సెటిల్ మెంట్ అధికారి అప్పారావు, కొవ్వాడ ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జెడ్పి సిఇఓ వెంకట్ రామన్, ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు ఆర్.వి ప్రసాద రావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కాశీని పోలిన హరిశ్చంద్రపురం శివాలయం

**- 400 సంవత్సరాల నాటి ఆలయం అంటున్న గ్రామస్థులు**
**- ఆలయం శిథిలావస్థకు రావటంతో రూ. 2.50 కోట్లతో పునర్నిర్మాణం**

**విశాలాంధ్ర-కోటబొమ్మాళి** : మండలం పెద్దహరిశ్చంద్రపురం గ్రామంలో వెలసిన శ్రీరాజరాజేశ్వరి సహిత వెంకటేశ్వర స్వామి పంచాయతన దేవాలయం కాశీని పోలిన శివాలయంగా ప్రసిద్ధి చెందింది. ముఖ్యమంగా ఆలయం ముందు బాగంలో చెరువు, పక్కన స్మాశానవాటిక ఉండటంతో చాలా మంది భక్తులు ఇది కాశీకి పోలిన ఆలయంగా చెబుతున్నారు. ఆలయ చరిత్రను చరిత్రకు ఒక చరిత్ర ఉంది. అదేమనగా ఒడిస్సా రాష్ట్ర పర్లాఖిముడి (పర్లాకిమిడి) మహారాజు హరిశ్చంద్రపురం, ప్రియాగ్రహారాలకు బ్రాహ్మణులకు అగ్రహారంగా ఇవ్వటం జరిగింది. ఈ గ్రామంలో సుమారు 400 సంవత్సరాల క్రితం అద్దమణుంగుల వెంకు బాయమ్మ, వెంకన్న దంపతులు తమశేష జీవితాన్ని కాశీలో గడుపుటకు నిర్ణయించుకొని తమ సంపదను దైవ కార్యములకు వెచ్చించుటకు నిర్ణయించుకొనిరి. కాశీ ప్రయాణంలో భాగంగా హరిశ్చంద్రపురం, అగ్రహాన్ని గుర్తించి యిచ్చట శివాలింగ నిర్మాణమునకు సంకల్పించుకొని శ్రీ రాజ రాజేశ్వరీ సహిత వెంకటేశ్వర సహిత అను నామ ధ్యేయంతో నిర్మాణ జరిపిరి. ఈ దేవాలయంకు ఇరువైపుల రాజరాజేశ్వరీ అమ్మవారు, జగన్నాథ స్వామి ఆలయాలు నిర్మించారు. ఇలా నిర్మించబడిన ఆలయం శివకేశవ క్షేత్రంగా నిలయమై కోరిన వారికి కొంగు బంగారమై విరాజల్లుతుంది. ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు, దాతల సహకారంతో పునర్మిర్మాణం సుమారు రూ.2.50 కోట్లతో నిర్మాణం జరుగుతుంది. ఈ యేడాది మార్చి 15,16,17 తేదీలలో అభిషేకాలు, పూజలు, తీరువీధి కార్యక్రమాలు పురోహితుల సమక్షంలో జరిపి 17వ తేదీన విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ పుణనిర్మాణకమిటీ సభ్యులు ఉన్నతాధికారి పూజారి సత్యన్నారాయణ, పూజారి సత్యం, బల్లి కామరాజు, విశ్రాంతి ఉపాధ్యాయుడు చింతాడ సత్యన్నారాయణలు తెలిపారు. ఈ ఆలయానికి 21 ఎకరాల భూమి ఉండగా అందులో 7ఎకరాల భూమిని రజకులకు, నాయబ్రాహ్మణులకు కేటాయించటం జరిగిందన్నారు. మిగిలిన భూమిని కౌలుకు ఇవ్వారన్నారు. ఈ మహత్తర కార్యక్రమానికి దాతల సహాయ సహకారాలు అందించి ఆ శంకరుణి కృపకు పాత్రులు కాగలరని కమిటి సభ్యులు కోరారు.

## అభివృద్ధి పనులకు ఎంపీపీ శంకుస్థాపనలు

**విశాలాంధ్ర-సోంపేట** : ఈ మండలం జింకిభద్ర, బెంకిలి గ్రామాలను కలిపే ప్రధాన రహదారి నిర్మాణానికి ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు సోమవారం శంకుస్థాపన చేశారు. అలాగే కుమ్మరవీధిలో అగ్నికుల క్షత్రియ సామాజిక భవనానికి స్లాబ్ ముహుర్తం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో ఒకవైపు సంక్షేమానికి ప్రధాన్యం ఇస్తూ మరోవైపు అభివృద్ధికి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అన్ని కుటుంబాలు సంక్షేమంగా ఉండాలని, అన్ని గ్రామాల్లో అభివృద్ధి సాధించాలన్నదే వైకాపా ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తామాడ పద్మావతి, ఉపసర్పంచ్ సాహుకారి జాని, పిరియా ధర్మేంద్ర, పోకల బాబూరావు, వి.అనంత్, తట్ట షన్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణానికి సాయిరాజ్‌కు వినతి

**విశాలాంధ్ర-సోంపేట** : మండలం మాకన్నపురంపంచాయతీ నుంచి పాత్రఖండ పంచాయతీ వరకు ఉప్పరిపేట, జగతికేశుపురం గ్రామాలకు త్వరగా రహదారి నిర్మాణం చేపట్టాలని సోమవారం సమాచార హక్కు చట్టం మండల కన్వీనర్ ఎల్.గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి మద్దు సోమశేఖర్ తదితరులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రం కూడా అందజేశారు. ఈ సందర్భంగా సాయిరాజ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి త్వరలోనే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కీళ్ల రామారావు, బతకల విశ్వనాథం, వైశ్యరాజు మురళి, డాక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా దిలీప్

**విశాలాంధ్ర-సంతబొమ్మాళి** : ఈ మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చింతాడ దిలీప్ కుమార్‌కు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమించారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డి నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్ర అధికార పార్టీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డి 15మందిని నియమించగా, అందులో సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన చింతాడ దిలీప్ కు పదవి లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీ చేసిన దిలీప్‌కు ఈ పదవి లభించడం పట్ల బోరుభద్ర గ్రామానికి చెందిన యువకులు హర్షం వ్యక్తం చేశారు. చింతాడ దిలీప్ తండ్రి స్వర్గీయ చింతాడ సుబ్బారావు సైతం బోరుభద్ర సర్పంచిగా, అప్పట్లో హరిచంద్రపురం నియోజకవర్గం అభివృద్ధి కమిటీ సభ్యులుగా, మండల ఆహార సలహా కమిటీ మెంబర్‌గా పదవులు కాంగ్రెస్ పార్టీలోనే నిర్వహించారు.

## రాష్ట్రానికి ప్రత్యేకహోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

**- షర్మిలపై వ్యక్తిగత విమర్శలు మానుకోండి - డీసీసీ అధ్యక్షుడు పరమేశ్వర రావు**

**విశాలాంధ్ర-అరసవల్లి:** రాష్ట్రానికి ప్రత్యేకహోదా కాంగ్రెస్ పార్టీతో సాధ్యమని, కాంగ్రెస్ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రాహుల్‌గాంధీ ప్రత్యేకహోదా ఫైల్‌పై తొలి సంతకం చేస్తారని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వర రావు అన్నారు. స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మకానికి పెట్టాయని పరమేశ్వర రావు ఆరోపించారు. 2019 ఎన్నిలకల ప్రచారంలో వైసీపీ అధికారంలోకి వస్తే ప్రత్యేక హెదా కోసం కేంద్రాన్ని డిమాండ్ చేస్తామన్న వాళ్ళు గడిచిన ఐదేళ్లలో ఏమి సాధించారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. చేసిన అవినీతిని కప్పిపుచ్చు కోవడం కోసం జగన్మోహన్ రెడ్డి, ఆ పార్టీ ఎంపీలు మోడీ దగ్గర మోకరిల్లారేతప్పా రాష్ట్ర అభివృద్ధి కోసం ఏనాడూ పార్లమెంట్లో చర్చించలేదని చెప్పారు. పోలవరానికి జాతీయ హెదాగానీ, విశాఖలో రైల్వేజోన్ కోసం గానీ, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో గానీ ఏనాడైనా కేంద్రాన్ని ప్రశ్నించారా అని నిలదీశారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చి నేడు నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన జగన్మోహన్ రెడ్డికి 2024 ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని, సభ్య సమాజం తలవంచుకునేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వాళ్ళపై విచారణ జరిపించి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని, ఇప్పటికే ఆయా నియోజకవర్గాల నుంచి దరఖాస్తులు అందుతున్నాయని పరమేశ్వర రావు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రెళ్ల సురేష్, నగర అధ్యక్షులు దేశెల్ల గోవింద మల్లిబాబు, పైడి నాగభూషణం, కూరాకుల లక్ష్మణ రావు, వెంకటరావు పాల్గొన్నారు.

## వాలంటీర్ పావని సేవలకు అభినందనల వెల్లువ

**విశాలాంధ్ర-కవిటి** : మండలంలోని బోరివంక సచివాలయం పరిధిలోని ఇద్దివానిపాలెం గ్రామానికి చెందిన బట్టి చినబాబుకు రెండు శాస్త్ర చికిత్సలు నిర్వహించగా జిల్లా కేంద్రంలోని రాగోలు జేమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వాలంటీర్ గండుపల్లి పావని రాగోలు లోని జిమ్స్ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేసింది. ఈ సందర్భంగా పావని సేవలకు గ్రామస్తులు,కుటుంబ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి,వైఎస్ఆర్సిపి నాయకులు గండుపల్లి హనుమంతు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏయూలో అక్రమ నియామకాలను రద్దు చేయాలి : దళిత సంఘాల ఆందోళన

**విశాలాంధ్ర-ఎచ్చర్ల** :డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన అక్రమ నియామకాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల సంయుక్త మండల ఆధ్వర్యంలో సోమవారం వర్సిటీ ప్రధాన గేటు ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఔట్సోర్సింగ్ నియామకాల్లో ఎలాంటి రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదన్నారు దళిత సంఘాల సంయుక్త మండలి ప్రతినిధులు కల్లేపల్లి రామ్ గోపాల్ మిస్కా కృష్ణయ్య బోనిల అప్పారావు మాట్లాడుతూ ఏర్పడిన వర్సిటీలోని రిజర్వేషన్లను పాటించకపోవడం సరైన చర్య కాదన్నారు వర్సిటీలోని అసిస్టెంట్ రిజిస్ట్రార్ ను తొలగించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలోని నిబంధనలు వ్యతిరేకంగా చేపట్టిన నియామకాలు అక్రమాలపై చర్యలు తీసుకోకపోతే జిల్లా దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. వర్సిటీలోని అక్రమాలపై రాష్ట్ర గవర్నర్ ముఖ్యమంత్రిని ఇతర ప్రజాప్రతినిధులను కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం వీరంతా విసి ప్రొఫెసర్ కె.ఆర్.రజిని కలిసి వినతిపత్రాన్ని అందజేస్తామన్నారు దీనిపై స్పందించిన విసి మాట్లాడుతూ అన్నింటినీ పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ల గోపి, దళిత సంఘాల నాయకులు దీర్గాసి గణేష్, కంపల రమణ, బొడ్డేపల్లి సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

## చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం



**విశాలాంధ్ర-జలుమూరు** : మండలంలోని పెద్దదుగాం గ్రామంలో ఆదివారం సాయంత్రం చెరువు అభివృద్ధి పనులను ఎంపీపీ వాన గోపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు అభివృద్ధి పనులు పూర్తయితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. అలాగే చెరువు అభివృద్ధి పనులలో భాగంగా మెట్లు నిర్మాణం కూడా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి, సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

## 42 కేజీల గంజాయి స్వాధీనం

**ఇద్దరు అరెస్టు**

**విశాలాంధ్ర-పలాస** : విశాఖపట్నం నుంచి ఒడిస్సా రాష్ట్రానికి రైలులో అక్రమంగా తరలిస్తున్న 42 కేజీల గంజాయిని పలాస రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసినట్లు విశాఖపట్నం లైన్ రైల్వే సి.ఐ కె.వైకుంఠరావు తెలిపారు. పలాస రైల్వే స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపద్యంలో గంజాయి, మద్యం, బంగారం డబ్బులు అక్రమ రవాణా ముమ్మరంగా చేపడుతున్న తనిఖీల్లో భాగంగా ఒడిస్సా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురం గ్రామానికి చెందిన శంకర్ మిశ్రా, సరోజ్‌కుమార్ సాహులు 4 లగేజీ బ్యాగులతో అనుమానంగా కనిపించడంతో రైల్వే పోలీసులు పట్టుకున్నారు. బ్యాగు తెరిచి చూసే సరికి 42 కేజీల గంజాయిని ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ తెలిపారు. ఆయనతో పాటు ఎస్.ఐ షరీఫ్, సిబ్బంది ఉన్నారు.

## ఇన్‌చార్జి ఎంపీడీవోగా వైకుంఠరావు

**విశాలాంధ్ర-పలాస** : పలాస ఇన్‌చార్జ్ ఎంపిడివోగా మెట్ట వైకుంఠరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పలాస ఎంపిడివోగా పనిచేసిన ఎస్.రమేష్‌నాయుడు విజయనగరం జిల్లా బలిజిపేట మండల ఎంపిడివోగా బదిలీపై వెళ్లారు. మండలంలో మండల పంచాయతీ విస్తరణాధికారిగా పని చేస్తున్న మెట్ట వైకుంఠరావును ప్రభుత్వ ఎంపిడివోగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆయన ఎంపిడివోగా బాధ్యతలు చేపట్టారు.

## విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

**విశాలాంధ్ర-సంతబొమ్మాళి** : ఈ మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 74మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు కోత చైతన్యతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు ట్యాబులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యతీస్తూ, ఒక్కో ట్యాబు 30000 రూపాయలు చొప్పున, విద్యార్థుల అభివృద్ధికి ఎంతో ఖర్చు చేస్తుందని అన్నారు. విద్యార్థులందరూ ట్యాబులను వినియోగించుకొని విద్యను చక్కగా అభివృద్ధి చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు తూట భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, తిరుపతిరావు ఆదికేశవరెడ్డి, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, మార్కండేయులు, క్రిష్ణవేణి, రోజా పాల్గొన్నారు.

## బుద్ధుని బోధనలతో శాంతి మార్గం

**జిజే కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్**

**విశాలాంధ్ర-కొత్తూరు...** బుద్ధుని బోధనలతోనే ప్రపంచం శాంతి మార్గంలో నడవగలదు అని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ అన్నారు. సోమవారం కళాశాల అవరణలో పూర్వ విద్యార్థులు ఏర్పాటుచేసిన బుద్ధుని విగ్రహం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడురీ విద్యార్థులు అహింస మూర్తి గౌతమ బుద్ధుని ఆదర్శంగా తీసుకొని శాంతియుత మార్గంలో నడవాలని ఆయన హితవు పలికారు ఈ కార్యక్రమంలో జిజే హైస్కూల్ గెజిటెడ్ హెచ్.ఎం ఏనేతల గోవిందరావు పూర్వవిద్యార్థుల ప్రతినిధులు పి.వెంకట కృష్ణ లోతుగెడ్డ కిరణ్, బి.గోవిందా ఇంకా పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'

**విశాలాంధ్ర-కొత్తూరు** : మండల గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ అదేశాల మేరకు గ్రామంలోగల అన్ని వీధుల్లో ప్రతీ ఇంటికి వెళ్లి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా మిని మెనోఫెస్ట్‌ను తెలుగుదేశం పార్టీ- జనసేన పార్టీల ఉమ్మడి మెన్ ఫెస్ట్‌లో బాగంగా భ్యావిష్యత్ తరల యువతకు, మహిళలకు, రైతులకు ఇస్తున్న హామీలను ప్రతి వీధిలో ప్రతీ ఇంటికి వెళ్లి తెలియపరిచి కరపత్రాలను పంపిణీ చేసి అనంతరం రచ్చబండ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన నాయకులు, స్థానిక గ్రామస్తులుతో కలసి పాల్గొన్న తెదేపా రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, కొత్తూరు మండల క్లస్టర్, యూనిటీ ఇన్చార్జ్లు, బూత్ కన్వీనర్ పాల్గొన్నారు.

## భయం గుప్పెట్లో చిన్నారులు

**విశాలాంధ్ర-జలుమూరు/సారవకోట:** మండలం కొత్తూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల భవనం పైకప్పు నుంచి పెచ్చులూడి పడటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పెచ్చులు ఎవరిపైన పడతాయో భయపడుతున్నారు. పాఠశాల భవనానికి మరమ్మత్తులు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. పరిస్థితిని అధికారులకు నివేదించామని పాఠశాల హెచ్ఎం ఈశ్వరిభాయి తెలిపారు.

## అగ్నికుల క్షత్రియుల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తాం...

**విశాలాంధ్ర-మందస :** జిల్లాలో అగ్నికుల క్షత్రియులు అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని అగ్నికుల క్షత్రియ జిల్లా యూత్ పోర్స్ కోర్ కమిటీ పలువురు సభ్యులు అన్నారు. ఆదివారం హరిపురంలో కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభాపరంగా ముందంజలో ఉన్న తమ కులం అన్నివిధాలుగా వెనుకబాటుకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ కార్యాచరణ ఏవిధంగా చేయాలో అన్న విషయం సమగ్రంగా ఆలోచన చేసి ముందుకు సాగుతామన్నారు. రానున్న రోజుల్లో కుల అభివృద్ధే ధ్యేయంగా మరెన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ పోర్సు అధ్యక్షులు సివంగి వాసు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దున్న గాంధీ వర్మ, యూత్ పోర్సు ఉత్తరాంధ్ర అధ్యక్షులు సొర్ర రామారావు, కుమారస్వామి, గణపతి, మాధవరావు, తుంభనాధంలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్దే ధ్యేయం

**విశాలాంధ్ర-పలాస :** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్నామని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. సోమవారం పలాస లేబరు కాలనీలో 23 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా వార్డులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టి తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్ అంబటి మాధురి, పి.ప్రసాద్, వైసీపీ నాయకులు అంబటి రాంబాబులు పాల్గొన్నారు.

## ఆధునిక విద్యతో ఉత్తమ ఫలితాలు

**విశాలాంధ్ర-పలాస :** ఆధునిక విద్యతో ఉత్తమ ఫలితాలు అందుకోగలమని పలువురు వక్తలు అన్నారు. సోమవారం కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసిఐ సిములేషన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణ కార్యక్రమంలో టెక్కలి, నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాలకు చెందిన జీవన శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఐఎఫ్‌వి ప్యానల్స్ సమర్థవంతంగా వినియోగించడంలో కొత్త సాంకేతిక నైపుణ్యాలు, వర్చువల్ ప్రయోగశాలలు, కృత్రిమ మేధపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఇలాంటి ఆధునిక పద్ధతుల ద్వారా తరగతి భోధన వలన మన విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పొందగలరన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.చిన్నంనాయుడు, పలాస ఎంఇవో-2 సత్యం, రిసోర్సు పర్సన్స్‌గా కొయ్యల శ్రీనివాసరావు, గౌతముడు, ఢిల్లేశ్వరరావు, సులోచనలు పాల్గొన్నారు.

## వైసీపీలో చేరిన 150 కుటుంబాలు

**విశాలాంధ్ర-సోంపేట :** సోంపేట పట్టణంలో వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసుల సమక్షంలో సోమవారం శ్రీకనకదుర్గా తాపీమేస్త్రీల సంఘానికి చెందిన 150 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం అధ్యక్షుడు తోట మోహనరావు, ఉపాధ్యక్షుడు కోల దుర్యోధనలతో పాటు పలువురుని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైసీపీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో శిలగాన భాస్కరరావు, బుద్దాన శ్రీకృష్ణ, రౌతు విశ్వనాధం, సర్పంచ్ నగిరి ప్రభావతి, పాడుగు కామేష్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల విజేత దత్త ప్రవీణ్

**విశాలాంధ్ర-కవిటి :** మండల కేంద్రమైన కవిటి ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లా షటిల్ బ్యాట్మింటన్ పోటీలలో శ్రీకాకుళంకు చెందిన దత్త ప్రవీణ్ ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నాడు. ద్వితీయ బహుమతి కవిటి గ్రామానికి చెందిన శేషు,సోమేశ్ కైవసం చేసుకున్నారు.తృతీయ బహుమతి సోంపేటకు చెందిన మున్నా,తేజ, నాలుగవ బహుమతి శ్రీకాకుళంకు చెందిన మనోహర్, సాయి, బెస్ట్ టీం కవిటి వివేక్, ముకుంద, ఆల్ రౌండర్‌గా కవిటి క్రీడాకారుడు సోమేశ్ సొంతం చేసుకున్నాడు. విజేతలకు జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయమ్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, ఉషోదయ యువజన సంఘం గౌరవాధ్యక్షులు బెందాళం చిట్టిబాబు, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, తమరాల జయరాం, మాదుగుల ప్రసాద్, ఉషోదయ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఐతమ్ ఆచార్యునకు ఫెలోషిప్

**విశాలాంధ్ర-టెక్కలి :** టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ ఆచార్యకు కర్నాటక మంగళూరు శ్రీనివాస యూనివర్సిటీ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ కోర్సు డిగ్రీని మంజూరు చేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్ ఆఫ్ గ్రిడ్ బెస్ట్ ఆప్టిమల్ పవర్ ట్రాన్స్‌మిషన్ విత్ ఇంటిగ్రేటెడ్ హైబ్రిడ్ రెన్యుబుల్ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ బి.ఎం మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ లో ఈ ఫెలోషిప్ డిగ్రీని శ్రీనివాస యూనివర్సిటీ మంజూరు చేసిందన్నారు. పిహెచ్‌డి అనంతరం పూర్తిచేసిన ఉన్నత డిగ్రీల్లో ఫెలో షిప్ ఒకటని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఐతమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ ఆచార్య మంగళూరు శ్రీనివాస యూనివర్సిటీలో ఫెలోషిప్ డిగ్రీని సాధించడంపై డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావుతోపాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాస రావు. ఆర్ అండ్ డి డీన్ డాక్టర్ డి.ఆజాద్, అకడమిక్ డీన్ డాక్టర్ డి.విజయ్ కుమార్, ఈఈఈ హెచ్వోడి డాక్టర్ కె.కిరణ్ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## ఆయన ధర్మాన కాదు... అధర్మ ప్రసాదరావు

**- అపరభగీరధుడు కాదు అబద్ధాల కోరు - టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్**

**విశాలాంధ్ర-అరసవల్లి :** ధర్మాన ఇంటి పేరులో ధర్మం ఉందేమో కానీ ఆయన మాటల్లో మాత్రం అంతా అధర్మమే ఉందని అందుకే ఆయనను అధర్మ ప్రసాదరావు అంటూ సంబోధించడం కరెక్టు అని టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. నగరంలోని 80 ఫీట్ రోడ్డులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. నగరంలో ధర్మన ప్రసాదరావును పొగుడుతూ అపరభగీరథుడని, రాజనీతిజ్ఞుడని, జిల్లా అభివద్ధి ప్రధాత అని పెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తుంటారని అందులో ఏ మాత్రం నిజం లేదని తెలిపారు. గతంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా కొనసాగుతున్న సమయంలో వైసీపీని ఉద్దేశించి అది ఓ కోళ్లఫారం టెంట్ అని సంభోదించిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్‌మోహనరెడ్డి ఓ వ్యాపారవేత్త అని ఆయన పాలనను కూడా వ్యాపారం మాదిరిగా చేస్తారని ఇదే విషయాన్ని కార్యకర్తలకు చెప్పాలని అప్పట్లో చెప్పారని అన్నారు. ఇప్పుడు జగన్‌మోహనరెడ్డితోనే రాష్ట్రాభివద్ధి సాధ్యమని అంటుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 1996లో వంశధార రైట్ మెయిన్ కెనాల్‌కు శంకుస్థాపన చేసి, భూసేకరణ కూడా చేసి ఆమదాలవలస ట్రాక్‌పై నీరు తరలించాలంటే అక్కడ వయోడెక్ట్ నిర్మించి... వంశధార నదిలోకి ట్రైలాండ్ ను పెట్టింది టీడీపీ ప్రభుత్వమే అన్నారు. అయితే 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఎమ్మెల్యేగా ఉన్న ధర్మాన ప్రసాదరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారని అందుకే అపరభగీరథుడు అయ్యారా అని ప్రశ్నించారు. కాలువలకు అనుమతి ఇచ్చింది చంద్రబాబు... వయోడెక్ట్ తెచ్చింది చంద్రబాబు... శ్రీకాకుళం, గార మండలాలకు నీరిచ్చింది చంద్రబాబునాయుడు అని గుర్తు చేశారు. జిల్లా కోసం పరితపించింది టీడీపీ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పీఎంజె బాబు, విభూది సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 విజేత పేటూరు

**విశాలాంధ్ర-కవిటి:** రాష్ట్రస్థాయిలో అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్న స్పెషల్ గ్రైస్ ఫౌండేషన్(ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో 2024 స్పోర్ట్స్ మీట్ సంధర్భంగా మండలంలోని బైరిపురం గ్రామంలో నిర్వహించిన ఎస్జీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 పోటీలలో పేటూరు జట్టు కవిటి జట్టు పై విజయం సాధించింది. సుమారు నెల రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు జిల్లా వ్యాప్తంగా సుమారు 60 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోటిలో కవిటి జట్టుపై పేటూరు జట్టు విజయం సాధించి ప్రథమ స్థానం చేసుకుంది. ప్రథమ స్థానం కైవసం చేసుకున్న పేటూరు జట్టుకు 15వేల రూపాయలు నగదుతో పాటుగా ట్రోఫీ దక్కించుకుంది. ద్వితీయ స్థానంగా నిలిచిన కవిటి జట్టుకు 10 వేల రూపాయలు నగదుతో పాటు ట్రోఫీ కైవసం చేసుకుంది.మంచి క్రమ శిక్షణ జట్టుగా కన్నుపుట్టుగ జట్టు అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌జిఎఫ్ సభ్యులు మాట్లాడుతూ యువతలో సేవాదృక్పథం పెంపొందించు కోవాలని, స్వచ్ఛంద రక్త దానం చేయాలని కోరారు. ఈకార్యక్రమానికి దాతలుగా ముందుకు వచ్చిన విశ్రాంత డిఎస్పి ఎస్‌వివి ప్రసాదరావు, ఉలల శేషు యాదవ్, సంజు శంకర్, రోటరీ క్లబ్ అధ్యక్షులు దుద్ది శ్రీనివాస్,కరగాన లక్ష్మీనారాయణలకు ఎస్‌జిఎఫ్ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బైరిపురం గ్రామ పెద్దలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలి

**- కుల గణన సర్వే, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ లక్ష్యాన్ని చేరుకోవాలి**

**- జిల్లా కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్**

**విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ :** నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్ అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలసి ఆయన తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సోమవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరైన ఈ సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పేదల ఇళ్ళ పట్టాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నదని, క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు లేకుండా ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. ఏ ఒక్క సచివాలయంలో కూడా సున్నా రిజిస్ట్రేషన్ ఉండరాదని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలు ఉంటే జిల్లా రిజిస్ట్రార్ తో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**- కులగణన పూర్తి కావాలి :** సమగ్ర కులగణన సర్వే జిల్లాలో 85 శాతం పూర్తి అయ్యిందని, మిగిలిన 15 శాతం త్వరిగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రతీ తహశీల్దార్, ఎంపీడీవో తమ మండల పరిధిలో కనీసం 200 కుటుంబాల సమాచారాన్ని స్వయంగా పరిశీలించి క్రాస్ చెక్ చేసుకుని నివేదించాలని స్పష్టం చేశారు.

**- ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేపట్టాలి :** జిల్లాలో 1.72 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు ఇంకా పంపిణీ చేయాల్సింది ఉందని ఆలస్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ కార్డుల పంపిణీ కూడా వీటితో పాటు రానున్న మూడు రోజుల్లో శత శాతం పూర్తి చేయాలని, అందరి మొబైల్ ఫోన్లలో ఆరోగ్య శ్రీ యాప్ కచ్చితంగా డౌన్ లోడ్ చేయించాలని అన్నారు. దీన్ని ప్రాధాన్యత అంశంగా భావించాలని చెప్పారు.

**- ఎన్నికల విధుల సిబ్బంది డేటా అప్లోడ్ చేయాలి :** అలాగే ఎన్నికల విధుల్లో భాగంగా ఆయా ప్రభుత్వ శాఖల సిబ్బంది వివరాలను ఎన్నికల పోర్టల్ లో త్వరిత గతిన అప్లోడ్ చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ పర్సనల్ మేనేజ్మెంట్ సిస్టమ్ లో జిల్లా, మండలం, గ్రామం, హోదా తదితర వివరాలను అప్లోడ్ చేసి రెండు రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆయా ఉన్నతాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు, వైద్య, ఆరోగ్య శాఖ, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల డేటా 100శాతం ఎంట్రీ కావాలని, ఇందుకు రెండు రోజుల గడువు మాత్రమే ఉందని చెప్పారు. తీవ్రమైన అనారోగ్య పరిస్థితులు ఉన్నవారికి ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. సమావేశంలో సిపీవో ప్రసన్న లక్ష్మి, జెడ్పీ సీఈఓ అర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవి కుమార్, డిఆర్డిఏ పీడీ విద్యా సాగర్, జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధ రావు, ఐసిడిఎస్ పిడి బి. శాంతి శ్రీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కే.శ్రీధర్, బి.అర్. అర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావు, దుమా పీడీ చిట్టి రాజు, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవ రావు, మెప్మ పీడీ కిరణ్ కుమార్, శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్ ఏ.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేశ్వరమ్మ కుటుంబాన్ని పరామర్శించిన బగ్గు

**విశాలాంధ్ర-జలుమూరు :** ఇటీవల కాలంలో స్వర్గస్తులైన కరణం రాజేశ్వరమ్మ కుటుంబం సభ్యులను పరామర్శించిన మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ ఇన్చార్జి బగ్గు రమణ మూర్తి సోమవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, సర్పంచ్లు తమ్మనగారి సతీష్ కుమార్, బగ్గు గోవిందరావు, మాజీ సర్పంచ్లు తర్ర బలరాం, పోన్నాడ దాలయ్య, చింతాడ తేజ, దేవా, మురళి పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ టీడీపీ విజయం కోసం పనిచేయాలి : మండల టీడీపీ నాయకులు

**విశాలాంధ్ర-కోటబొమ్మాళి :** ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ విజయం కోసం కష్టపడి పని చేయాలని టిడిపి మండలపార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపీపీలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, టెక్కలి నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు పూజారి శైలజలు అన్నారు. వీరు సోమవారం మండలం చిన్నసాన, గుడివాడ, జీయన్నపేట గ్రామాల్లో జనసేన టెక్కలి నియోజకవర్గ నాయకులు పల్లి కోటేశ్వర రావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూరానున్న ఎన్నికల్లో తెలుగుదేశం విజయం కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. మనమంతా రానున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా కింజరాపు అచ్చెన్నాయుడుకు, ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడుకు, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సుమారు ఐదేళ్ళ జగన్ పాలనలో అన్నివర్గాలవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అందుకే టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు కాగానే బీసీలకు రక్షణ చట్టాన్ని తీసుకొస్తామని మన నాయకులు హామీని ఇచ్చారని వారు గుర్తుచేసారు. గ్రామంలో సమస్యలు తిష్టవేసి కూర్చున్నా పట్టించుకోని పరిస్థితుల్లో స్థానిక వైకాపా నాయకులు ఉన్నారని ఆరోపించారు. స్థానిక వైకాపా నాయకుల ఆగడాలు ఎక్కువయ్యాయని నియోజకవర్గ ప్రజలంతా జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొండు లక్ష్మణరావు, కర్రి అప్పారావు, నంబాళ శ్రీనివాస్, బాడాన రమణమ్మ, సాసుమంతు ఆనందరావు, హనుమంతు అప్పలరాజు, తంగుడు సునీల్, దేవాది సింహాద్రమ్మ, చల్ల రాము, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పాగోటి అనిల్‌కుమార్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ భూములకు రక్షణ కల్పించాలి

**విశాలాంధ్ర-మందస :** ఆదివాసీ భూములకు రక్షణ కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, ఉపాధ్యక్షులు ధర్మారావు, గురునాధ్, పాల్గుణరావులు కోరారు. సోమవారం మందసలో గిరిజనలు ర్యాలీ నిర్వహించి అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులు మాట్లాడుతూ కొండలోగాం లో 110 కుటుంబాలు లక్ష్మీనారాయణపురం రెవిన్యూ పరిధిలో సర్వే నెం.9,26ల్లో సుమారు 70 ఎకరాల భూమిని తరతరాలుగా సాగు చేస్తున్నా రని, గిరినేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా కాజేయాలని చూస్తున్నారని, గిరిజనుల జోలికొస్తే సహించేది లేదన్నారు. మండలంలోని వందలాది ఎకరాల గిరిజనుల భూములను గిరిజనేతలరు ఆక్రమించుకుంటున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్, సిఐటీయు నాయకులు పి.దేవేంద్ర, గిరిజనులు సవర మీనాక్షి, సవర ఘాన్సీ, సవర తిరుపతిరావు, సవర రమణ, సవర కూర్మారావులు పాల్గొన్నారు.

## తెలగ సామాజికవర్గాన్ని బీసీ జాబితాలో చేర్చాలి

**- శ్రీకాకుళం చేరుకున్న తెలగ సంఘం పాదయాత్ర**

**- ఉత్తరాంధ్ర తెలగ సంఘం అధ్యక్షులు పల్లంట్ల వెంకటరామారావు**

**విశాలాంధ్ర-అరసవల్లి:** ఉత్తరాంధ్రాలోని తెలగ సామాజికవర్గాన్ని బీసీ జాబితాలో చేర్చాలని పల్లంట్ల వెంకటరామారావు డిమాండ్ చేశారు. ఇచ్చాపురంలో ప్రారంభించిన పాదయాత్ర సోమవారం నాటికి శ్రీకాకుళం చేరుకుంది. ఈ సందర్భంగా పెద్దపాడులోని పద్మావతి కళ్యాణమండపంలో శ్రీకాకుళం జిల్లా తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రొక్కం సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో పల్లంట్ల వెంకటరామారావు మాట్లాడారు. తెలగ సామాజికవర్గం ప్రతినిధులు ఒకప్పుడు జమిందార్లుగా ఉండేవారని కాలమాన పరిస్థితులు దృష్ట్యా పేదలుగా మిగిలారని తెలిపారు. తమ సామాజిక వర్గంలో 90 శాతం మందికి పైగా దారిద్రయ్య రేఖకు దిగువన ఉండి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న ఉద్యోగులు రాక ఆత్మస్థైర్యం కోల్పోయి యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలగ సామాజిక వర్గాన్ని ఓసీల్లో ఉంచడం పట్ల యువత చాలా ఇబ్బందులు పడుతున్నారని, చదువుకున్నప్పటికి ఉద్యోగాలు రాక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీ జాబితాలో తమ కులాన్ని చేర్చితే మళ్లీ సామాజికవర్గం చైతన్యం చెందుతుందని, అందుకే తెలగ సామాజికవర్గాన్ని బీసీ జాబితాలో చేర్చాలన్న ప్రధాన డిమాండ్‌తో పాదయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. ఇంతవరకు పాలకులు తమ సామాజికవర్గాన్ని మోసగించి అధికారంలోకి వచ్చారని, బిసి జాబితాలో తమ సామాజిక వర్గాన్ని చేరుస్తామని మాట ఇచ్చి తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. 2024 ఎన్నికల్లో తమ సామాజికవర్గానికి బిసి జాబితాలో చేర్చాలని ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. రాజ్యాధికారాన్ని సాధించే దిశగా న్యాయం చేయక పోతే రానున్న ఎన్నికల్లో ప్రచారం కోసం వచ్చే నాయకుల్ని తమ గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు.

- మేనిఫెస్టోలో చేరుస్తాం: గుండ లక్ష్మీదేవి... తెలగాలను బీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ బి వెంకటరమణ చేపడుతున్న పాదయాత్రకు గుండ లక్ష్మీదేవి సంఘీభావం తెలిపారు. గతంలో టిడిపి అధికారం ఉన్న సమయంలో కొంతమేర తెలగ కులస్తులకు ప్రాధాన్యత కల్పించామని శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి తెలిపారు. తెలగాలను ఓసి జాబితా నుండి బీసీల్లో చేర్చేందుకు 2024 టిడిపి మేనిఫెస్టోలో చేర్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. మీ వినతిని జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. తెలగ కులస్తుల న్యాయపరమైన పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా తెలగ సంఘ అధ్యక్షులు రొక్కం సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి త్రిపురాన రాజేంద్రదాస్,మండల అధ్యక్షులు యనమల జనార్దన్ రావు,శవాన ఉమామహేశ్వరి, కొండా రాంబాబు సుంకరి కృష్ణ,సిరిగిరి వరదరాజు,మునుకోటి సత్యనారాయణ,పిల్లలు నీలాద్రి, కురుమెల్ల శశిభూషణ్,పుట్ట అంజనీకుమార్,కేసిరెడ్డి వెంకటేష్, పెద్ది కవిత, పిల్లల శ్రీధర్ అడప శాంతి, రెడ్డిపల్లి నేలవేణి, గొంటి వెంకటరమణ, అడపా రమాకాంత్, రొక్కం సత్యనారాయణ, తోట తారక్, మర్రి మెహర్ ప్రసాద్,అధికారి రవి, గోపిశెట్టి అమర్నాథ్, మోటూరు నాని, భవాని, పండాల లక్ష్మి, మోగుసాల నాగేశ్వరరావు, కొఠారి శ్రీరామకృష్ణ,త్రిపురాణ వరప్రసాద్ బి.గున్నయ్య, ఇచ్ఛాపురం నకు చెందిన పల్లంటి చిరంజీవి, కౌన్సిలర్ పల్లంటి మధుమూర్తి, కురుమల్లి శివాజీ, విజయకుమార్, జయరాజ్, పి సత్యనారాయణ, కుమార్, భీమారావు, శివ, అప్పారావు, పోతిరెడ్డి ఈశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా తెలగ సంక్షేమ సంఘం జిల్లా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నోట్స్ పుస్తకాలు, పలకలు పంపిణీ

**విశాలాంధ్ర-సంతబొమ్మాళి :** మండలం బోరుభద్ర గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకునే 56 మంది విద్యార్థిని, విద్యార్థులకు జనసేన పార్టీ ఆర్థిక సహాయంతో, నోటుబుక్స్, పలకలు, పెన్సిల్స్ పంపిణీ చేసినట్లు వైకాపా యువత అధ్యక్షుడు ముద్దపు అనందరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వైకుంటారావు, గోవిందరావు, భవాని చైర్మన్ జ్యోతి జనసేనపార్టీ నాయకులు కూరకుల యాదవ్, చింతాడ రేవంత్, గిరిబాబు, జి.వి.రాజు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**విశాలాంధ్ర-సోంపేట :** కంచిలి మండలం పురుషోత్తపురం గ్రామ సచివాలయం పరిధిలో ఎస్ఆర్‌సి పురం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు 3.0 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సర్పంచ్ డొక్కర తులసీ బలరాం ఆధ్వర్యంలో ఎంపీపీ పైల దేవదాసురెడ్డి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వజ్జ మృత్యుంజయరావు, ఎఎంసి చైర్మన్ లడ్డుకేశవపాత్రో, మండల జెసిఎస్ కన్వీనర్ కొనపల సురేష్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు దుర్గాశి ధర్మారావు తదితర గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## జలుమూరు తహశీల్దార్‌గా నాగమ్మ

**విశాలాంధ్ర - జలుమూరు :** మండల తహశీల్దార్‌గా సీహెచ్. నాగమ్మ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నం పరవాడ నుంచి శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు, వీఆర్ఏలు తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## వర్సిటీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

**- డిగ్రీ వార్షిక పరీక్షలు తప్పిన విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ పరీక్షలు - వి సి**

**విశాలాంధ్ర-ఎచ్చెర్ల :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు అనుబంధ డిగ్రీ కళాశాలలో సెమిస్టర్ విధానం రాక మునుపు చదివి వార్షిక పరీక్షలు రాసి తప్పిన విద్యార్థుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు విసి ప్రొఫెసర్ కె.ఆర్ రజిని తెలిపారు వర్సిటీలో సోమవారము అకాడమిక్ అవిశాలు వినతులపై ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు పరిష్కరించనున్నట్లు చెప్పారు ఇటీవల జరిగిన నియామకాల్లో రిజర్వేషన్ పాటించారా లేదా అనే విషయాన్ని తెలుసుకుంటామన్నారు ఈ ఏడాది మే లేదా జూన్ నెలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించవచ్చని చెప్పారు వర్సిటీ అనుబంధ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్లు స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు ప్లేస్మెంట్ కార్యాలయాలు మరింత సమర్థవంతంగా పనిచేసేలా ఆయా కళాశాల ప్రిన్సిపాల్ లేఖలు రాయాలన్నారు వర్సిటీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చైర్ ఏర్పాటుకు విధివిధానాలు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డికి అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్ ఉదయ్ భాస్కర్ డాక్టర్ సిహెచ్ రాజశేఖర్ రావు డీన్ డాక్టర్ ఎం అనురాధ గ్రీవెన్స్ విభాగం ప్రతినిధి డాక్టర్ యు కావ్య జోత్న్న తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల భూములు ఆదివాసీల గిరిజనులకే చెందాలి

**విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్:** ఆదివాసీల భూములు ఆదివాసీల గిరిజనులకే చెందాలని ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ మానవ హక్కుల అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కరణం తిరుపతి నాయుడు జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్‌ను కోరారు. సోమవారం జిల్లాలో స్పందనలో కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. హిరమండల మండలం, రుగడ పంచాయతీ ఎం.అవలంగి గ్రామ పరిధిలో గల బొమ్మిక గూడలో గత 25సంవత్సరాలుగా ఆదివాసి గిరిజనలు నివసిస్తూ అటవీ భూములను సాగుచేస్తూ కుటుంబాలతో జీవనాన్ని కొనసాగిస్తున్నారు బొమ్మిక గూడలో నివసిస్తున్న ఆదివాసి గిరిజనులకు ఇళ్ల స్థలాల పట్టాలు, సాగు భూములకు సాగు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరుచేసి వారి జీవితాలలో వెలుగులు నింపాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సంబంధిత అధికారులకు ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుదారునితోపాటు గిరిజనులు సవరప్రసాద్, సవర బిస్రో, బిడ్డిక ఆనందరావు పాల్గొన్నారు.

## రెండో పట్టణ ఎస్ఐగా హరికృష్ణ

**విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం :** శాంతిభద్రతల పరిరక్షణలో , ప్రజా సమస్యల పరిష్కారంలో తమ వంతు కృషి చేస్తానని ఫిర్యాదుదారులు ఇచ్చిన సమాచారం మేరకు కేసులు పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని రెండో పట్టణ ఎస్సై హరికృష్ణ తెలిపారు. సోమవారం రెండో పట్టణ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించి, కేసుల పరిష్కరించే దశగా అవగాహన కల్పిస్తామని తద్వారా క్రైమ్ రేట్ తగ్గించే ఏర్పాటు కలుగుతుందని, ప్రజలతో మమేకమయ్యే విధంగా పోలీస్ యంత్రాంగం పనిచేసినట్టుగా , చేస్తామని, అసాంఘిక కార్యక్రమాలు, మాదక ద్రవ్యాలు కు యువత అలవాటు పడి చెడు అలవాట్లకు బానిస కాకుండా, కౌన్సిలింగ్ ఇప్పిస్తామని, ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తామని అన్నారు. ప్రజల సమస్యలు వచ్చేటప్పుడు నేరుగా పోలీస్ స్టేషన్కు వచ్చి వారి సమస్యలు నిర్ణయించుకోవచ్చునని వాటి ద్వారా వారి సమస్యను పరిష్కరించగలుగుతామని ప్రజలు కూడా సహకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందిని కలుసుకున్నారు.

## నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం

**జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్**

**విశాలాంధ్ర-శ్రీకాకుళం :** నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నులిపురుగుల నివారణ గోడ ప్రతిని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కింద ఈ నెల 9వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం (నేషనల్ డివార్మింగ్ డే ) చిన్నారులలో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఈనెల 9వ తేదీన నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి చిన్నారికి నులిపురుగుల నివారణ (అల్బెండజోల్) మాత్రను తప్పక వేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.

# ట్రాఫిక్ నియమాలు పాటించాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రహదారుల్లో ప్రయాణాలు సాగించేటప్పుడు, రోడ్డు దాటుతుంటే సందర్భాల్లో ఖచ్చితంగా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాల బారి నుండి రక్షణ ఉంటుందని టోల్ ప్లాజా ప్రాజెక్స్ మేనేజర్లు సెంథిల్‌కుమార్, వి.వి.కె.వి ప్రసాద్‌లు అన్నారు. సోమవారం పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో కరాపాడు టోల్ ప్లాజా సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. టోల్ ప్లాజా మేనేజర్ జి.వి.రమణరావు, సేఫ్టీ మేనేజర్లు కిరణ్‌కుమార్, సంజయ్‌లతో కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత పర్యవేక్షణలో నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. పాఠశాలలకు వెళ్ళి వచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, తొందరపాటు తగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్సిడెంట్ మేనేజర్

రవి.కొప్పల, మెంటైనెన్స్ మేనేజర్ చిన్ని, రవికుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని ప్రాంతాలకు బస్సు సౌలభ్యం

విశాలాంధ్ర – ఇచ్ఛాపురం : మండలంలో మారుమూల గ్రామాలకు చెందిన ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించే చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా పరిషత్ ఛైయిర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కొళిగాం నుండి మండల కేంద్రానికి ఏర్పాటు చేసిన ఆర్టీసి బస్సును సోమవారం ఎమ్పీపి బోర పుష్ప, జెడ్పీటీసి నారాయణమ్మ తదితరులతో కలిసి బిర్లంగి గ్రామం వద్ద ప్రారంభించారు. మొదటి టికెట్టు కొని బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమెను ఆహ్వానించిన గ్రామస్తులను

ఉద్దేశించి ఆమె మాట్లాడుతు మండలంలో బొడ్డబడా, ఒడిశాకు చెందిన భీంపురం గ్రామాల ప్రజల ఇక్కట్లు తొలగేలా బాహుదా నది పై బ్రిడ్జి ఏర్పాటు చేయించి, తాజాగా అక్కడి ప్రజలు మండల కేంద్రానికి చేరుకునేందుకు అవసరమైన ఆర్టీసీ సేవలను కూడా ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు వై.సి.పి మండల శాఖ అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖర్, మండల, పట్టణ జే.సి.ఎస్ కన్వీనర్లు ఆశి పురుషోత్తం, సాలిన డిల్లిరావు, బాకి లక్ష్మీనారాయణ, దక్కత నూకయ్య, రంగాల జాని, కారంగి త్రినాద్, సంతోష్ మండల్, లోపింటి దీనబంధు, రంపత్ని చిట్టిబాబు, చిరంజీవి, దూపాన వెంకటరావు, ధనేశ్వర రావు, తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేవలతోనే సంస్థలకు గుర్తింపు

- టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఏ స్వచ్ఛంద సంస్థ కు అయినా సమాజానికి చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. వంజంగి మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎండ చిట్టయ్య, గణపతి రావుల చారిటబుల్ ట్రస్ట్ ను రవికుమార్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ స్వచ్ఛంద సంస్థలు సమాజ సేవలో ముందుండి గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు. ట్రస్ట్ ఏర్పాటు చేయడంతో పాటు అంకితభావం, సేవాభావం కలిగి ఉండా లన్నారు. అప్పలనాయుడు తన కుటుంబ సభ్యుల పేరు తో స్వచ్ఛంద సంస్థ నెలకొల్పి సేవకు ముందుకు రావడం అభినందనీ యమన్నారు. ఏ ఆశయ సాధనకు సంస్థ ఏర్పాటు చేశారో అందుకోసం ముందుకు సాగాలన్నారు. మానవసేవే మాధవ సేవగా భావించి మదర్ తెరిసా సేవలు అందించి విశ్వవ్యాప్తంగా తల్లిగా గుర్తింపు పొందారు న్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తి తో ముందుకు సాగాలని సూచించారు. ఏపీజీ సేపాన గోవిందరావు, పూజారి హరిబాబు, పైడి హరినాధరావు, గోవిందరావు, నారా యణరావు, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలకు అడ్డుకట్ట వేస్తా

విశాలాంధ్ర- ఇచ్ఛాపురం : ఎన్నికల సీజన్ నేపధ్యంలో ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్ ద్వారా జారీ చేసే ఆదేశాలకు లోబడి సరిహద్దుల్లో అక్రమ రవాణా లేకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందిని ట్రాన్స్‌పోర్టు కమీషనర్ చంద్ర శేఖర్ అన్నారు. సోమవారం స్థానికంగా పర్యటించిన ఆయన పురుషోత్తపురం ఉమ్మడి తనిఖీ కేంద్రాన్ని స్థానిక ఎం.వి.ఐ వెంకట్రావుతో కలిసి సందర్శించారు. అక్కడి పరిస్థితులను, సరిహద్దులో ఏర్పాటుచేసే ఎన్నికల ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన విధుల నిర్వాహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సిబ్బంది కొరత ఉన్నా ఇతర శాఖల సిబ్బంది సహకారం సమన్వయంతో పని చేసి, అక్రమ మద్యం, డబ్బు రవాణాను అడ్డుకోవడం జరుగుతుందని స్పష్టం చేసారు. జిల్లాకు గల ఒఢిశా సరిహద్దుల్లో ప్రత్యేకంగా నాలుగు చెక్‌పోస్టులను పురుషోత్తపురంతో పాటు అచ్యుతాపురం, వసుంధర, సిద్ధిగాం గ్రామాల వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం అంతటా నగదు రహిత లావాదేవీలు జరుగుతున్నాయని, తమ శాఖ ద్వారా 80 రకాల సేవలను అందివ్వడంతో పాటు సమస్యలను 24గంటల్లోనే పరిష్కరిస్తున్నామని, పర్మిట్ల కోసం నగదు ఎవ్వరికి చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రభుత్వ వైద్యులు డ్టార్ పి. దేవేంద్ర పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతు వాహనదారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో 108కి ఫోన్ చేసి సహాయాన్ని పొందాలని, వాహన చోధకులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.ఎం.వి.ఐలు పాల్గొన్నారు.

## ఆత్మహత్యలే పరిష్కారం కాదు

- లామ్ ఆఫీసర్స్ శిక్షణా సెమినార్‌లో గ్రీన్‌సిటీ అధ్యక్షురాలు వరలక్ష్మీ

విశాలాంధ్ర-అరసపల్లి : విశాఖపట్నంలోని ఓ హొటల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన లామ్ ఆఫీసర్స్ శిక్షణా సెమినార్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకుగానూ నాయకత్వ లక్ష్యణాలకు పెంపొందించుకోవడం, విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించాల్సిన విద్యార్థులు కూడా బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆత్మహత్యలు నివారణపై కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. అలాగే జెసీఐ అధ్యక్షురాలిగా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని అనేక సేవా కార్యక్రమాలపై దష్టి సారించినట్లు తెలిపారు. నాయకత్వం అంటే అధికారం కాదని సమాజ సేవ చేసేందుకు ఒక గొప్ప అవకాశమని వరలక్ష్మీ అని చెప్పారు. ఆమె చెప్పిన సమాధానాలకు ప్రతినిధులు అభినందిస్తూ అవుట్ స్టాండింగ్ పాటిస్‌పెంట్‌గా జోన్ అధ్యక్షులు గొంప సురేష్ నుంచి అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ లక్ష్మణరావు, సభ్యులు గీత, భ్రమరాంబిక, జెఎసీ చైర్మన్ మధుబాబు, పైలెట్ కెవి రావు, నేషనల్ శిక్షకులు కె.వి రత్నం, రజిత కోశర్ల, జ్యోతి, అనిరుధ్, సెనేటర్ పవన్ కుమార్, భువన్, జడ్ వీపీ సుధీర్‌లు అభినందించారు.

## పదవీ విరమణ మహోత్సవం

విశాలాంధ్ర-జలుమూరు : సోమవారం కంబకాయ గ్రామంలో పాగోటి అప్పలనాయుడు మాష్టారు పదవీ విరమణ సన్మాన మహోత్సవం కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ ఇన్చార్జి బగ్గు రమణ మూర్తి- సుగుణమ్మ దంపతులు పాల్గొన్నారు. అప్పలనాయుడును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు చెట్టు కృష్ణ మూర్తి, చిరినిల్లి చిన్నబాబు, పాగోటి అప్పల స్వామి, వెలమల భాస్కరరావు, తంగుడు కృష్ణమూర్తి మాష్టారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన ఆక్స్‌ఫర్డ్ మెగా సైన్స్ ఫెయిర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీ లో రెండురోజులుగా సాగుతున్న మెగా సైన్స్ ఫెయిర్ సోమవారం విజయవంతంగా ముగిసింది. మొదటి రోజు పట్టణ ప్రజలు, విద్యార్థుల కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో పోటెత్తగా, రెండవరోజు నగరంతో పాటు శ్రీకాకుళం, ఎచ్చెర్ల మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ ను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీనితో రెండు రోజులు సందర్శకులతో సైన్స్ ఫెయిర్ కిటకిట లాడుతూ సాగింది. పాఠశాల డైరెక్టర్ అన్నెపు లావణ్య రాణి, ప్రిన్సిపల్ బి.కిరణ్ కుమార్, కో ఆర్డినేటర్ లు దీపా కుమారి, దేవి, విజయ తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా ఎన్నికల నిర్వాహణ

మూల భాస్కర అప్పారావు తహశిల్దార్ | టి. ఇమ్మాన్యుయల్ రాజు ఇన్‌స్పెక్టర్ | వి.సత్యన్నారాయణ టౌన్ సబ్-ఇన్‌స్పెక్టర్ | లక్ష్మణరావు రూరల్ సబ్-ఇన్‌స్పెక్టర్

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఎన్నికల సీజన్ ప్రారంభం కావడంతో పట్టణంలో వివిధ శాఖల అధికారుల బదిలీలు జరిగాయి. సోమవారం స్థానిక తహశిల్దార్‌గా మూలభాస్కర అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అన్ని శాఖల సమన్వయంతో రాబోయే ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత నెలలో ఇదిపరకే ఇన్‌స్పెక్టర్‌గా టి. ఆమ్మాన్యుయేల్ రాజు విధుల్లో చేరగా తాజాగా పట్టణ ఎస్సైగా వి. సత్యన్నారాయణ, రూరల్ ఎస్సైగా లక్ష్మణ రావులు బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా విధుల్లో చేరిన అధికారులు స్థానిక పరిస్థిలులను అవగాహన చేసుకునేందుకు సిబ్బందితో సమీక్షలు నిర్వహించారు. ప్రజలకు దగ్గరయ్యేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. గతంలో మండలంలో రెండు పోలిస్ స్టేషన్లలో పనిచేసి, అప్పటి పాత్రికేయుల ప్రమేయంతో ఫ్యాక్షన్ గ్రామంగా పేరుమోసిన బాలక్రిష్ణాపురంలో ఇరు వర్గాలను కొలిక్కి తెచ్చిన వ్యక్తి తిరిగి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడంతో ప్రణాళికాయుతంగా సాగుతు రాబోయే ఎన్నికల్లో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చేయగలననే భరోసాతో ఉండగా, తాజాగా విధుల్లో చేరిన సబ్ ఇన్‌స్పెక్టర్లు సైతం అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సరిహద్దు ప్రాంతంలో కుల సమీకరణాలు, అధికార పార్టీ వ్యవహారాలు తదితరాలను అధిగమించి అధికారులు విధుల నిర్వాహణ ఉండాలని స్థానికులు భావిస్తున్నారు.